కార్తీక శోభ

- కిక్కిరిసిన శైవాలయాలు
- పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు
- పవిత్ర జ్యోతులు వెలిగించిన మహిళలు



ప్రత్యేక అలంకరణలో తలకోన శ్రీసిద్ధేశ్వరస్వామి



భాకరాపేట : విశేష అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి

కపిలతీర్థంలోని మాల్వాడిగుండంలో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు





కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కపిలతీర్థంలో అయ్యప్ప దీక్ష తీసుకుంటున్న భక్తులు



పరమేశ్వరుని స్మరించుకుంటున్న మహిళలు

కార్తీక మాసం.. పరమేశ్వరునికి అత్యంత ప్రీతిపాత్రం.. భక్తకోటికి ముక్తిమార్గం.. లోకంలో చీకటిని పారదోలి వెలుగులు నింపే జ్యోతి స్వరూపం.. లయకారుని ప్రసన్నం చేసుకునే నియమ నిష్టల సమాహారం.. పుణ్యస్నానాలతో పునీతులయ్యేందుకు జనులకు మహిమాన్వితం అవకాశం. ఈ క్రమంలో పరమ శ్రేష్టమైన కార్తీక సోమవారం సందర్భంగా శైవాలయాలకు భక్తులు పోటెత్తారు. దీపారాధనలతో మహిళలు పులకించారు. మహేశ్వరుని దివ్యతేజస్సును దర్శించుకుని తరించారు.

తిరుపతి కల్చరల్ : కార్తీక సోమవారం సందర్భంగా తిరుపతిలోని శివాలయాలు కిటకిటలాడాయి. ప్రధానంగా కపిలతీర్థంలోన శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాల్వాడిగుండంలో పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

చంద్రగిరి : మండలంలోని తొండవాడ సమీపంలో స్వర్ణముఖినదీ తీరాన వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి (ముక్కోటి) ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం జరిపించారు. నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

పుట్టాలమ్మ ఆలయంలో..

చంద్రగిరి ఆర్‌ఎఫ్ రోడ్డులోని శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం (పుట్టాలమ్మ ఆలయం)లో కార్తీక మాస పూజలు నిర్వహించారు. స్వామి వారికి కైలాస పర్వత అలంకారణ చేపట్టారు.

తలకోనలో..

భాకరాపేట : తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. తలకోన ఝరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని సేవించుకున్నారు.

చిన్నగొట్టిగల్లులో..

చిన్నగొట్టిగల్లు మండలంలోని భీమేశ్వర స్వామి , నెమిలిగుండ్ల శివాలయం, దేవరకొండ శివాలయం, బండకొండ శ్రీ సిద్ధేశ్వరస్వామి, చట్టేవారిపాళెంలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

క్లుప్తంగా

హక్కుల పరిరక్షణకు కృషి



నియామక పత్రాలు అందిస్తున్న మురళి

తిరుపతి కల్చరల్ : మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఇండియన్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కాణిపాకం మురళి పిలుపు నిచ్చారు. సోమవారం నరసింహ తీర్థం రోడ్డులోని సంస్థ కార్యాలయంలో నగర నూతన కమిటీని ఎంపిక చేశారు. నగర గౌరవాధ్యక్షుడిగా కె.కుమార్, ఫైనాన్స్ సెక్రటరీగా ఇ.హరినాయుడు, ఉపాధ్యక్షులుగా ఎ.మెగిలీశ్వరుడు, బి.సిద్ధేశ్వర్, సహాయ కార్యదర్శిగా వై.మధుసూదన్‌ను ఎన్నికయ్యారు. అనంతరం కమిటీ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు.

ఆలయ అభివృద్ధికి వినతి



టీటీడీ ఈఓకు వినతిపత్రం అందిస్తున్న మంత్రి అనిత

తిరుపతి (అలిపిరి): ఉపమాకలోని శ్రీకల్కి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత కోరారు. సోమవారం ఈ మేరకు తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈఓ శ్యామల రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తిరుమలలో భక్తులకు అందిస్తున్న సేవలపై చర్చించారు.

విశ్రాంత ఉద్యోగులకు గొడుగులు

తిరుపతి అర్బన్ : జిల్లాలోని 400 మంది ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగులు తమ అసోషియేషన్‌కు ప్రతి నెలా వచ్చే పింఛన్‌లో కొంత మొత్తం జమ చేస్తుంటారు. అందులో నుంచి ఏటా ఏదో ఒక వస్తువు కొనుగోలు చేసి సభ్యులకు పంపిణీ చేస్తుంటారు.ఈ క్రమంలోనే ఈ ఏడాది గొడుగులు కొనుగోలు చేశారు. సోమవారం ఈ మేరకు తిరుపతి బస్టాండ్ వద్ద గొడుగులను డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఏటీఎం రామచంద్రనాయుడు చేతుల మీదుగా విశ్రాంత ఉద్యోగులకు పంపిణీ చేశారు.

విత్తన దుకాణాల తనిఖీ

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండలంలోని విత్తన దుకాణాలను ఏఓ ఖాదర్‌బాషా సోమవారం తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలు అమ్మాలని, కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రెస్‌క్లబ్ కమిటీ

తిరుపతి అర్బన్ : నూతనంగా ఎన్నికైన తిరుపతి ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి బాలచంద్ర, కోశాధికారి చంద్రబాబు, ఉపాధ్యక్షుడు ప్రకాష్‌బాబు, జాయింట్ సెక్రటరీ మాధవ్, మెంబర్లు పాల్గొన్నారు.

టీటీడీ ఈఓతో భేటీ

తిరుపతి(అలిపిరి): తిరుపతి ప్రెస్ క్లబ్ నూతన కమిటీ సభ్యులు సోమవారం టీటీడీ పరిపాలన భవనంలో ఈఓ శ్యామలరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

నిరుపయోగంగా రిసెప్షన్ సెంటర్లు

ప్రజా సంక్షేమమే పాలకుల కర్తవ్యం కావాలి. ప్రజా ధనం వృథా కాకుండా సద్వినియోగం చేయాలి. ప్రజా సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి ఉండాలి. అయితే కూటమి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించారనే ఒకే ఒక్క కారణంతో జనాలకు ఉపయోగపడే వైఎస్సార్ రిసెప్షన్ సెంటర్లను నిరుపయోగంగా మార్చేసింది. పలు ఇబ్బందులతో వచ్చే వారికి నీడ కల్పించే కేంద్రాల లక్ష్యాన్ని నీరుగార్చేసింది.

- వృథాగా మారిన ప్రజాధనం
- సద్వినియోగంలో ప్రభుత్వ నిర్లక్ష్యం
- పూర్తిగా లోపించిన నిర్వహణ
- అవస్థలు పడుతున్న ప్రజానీకం



ఏరియా ఆస్పత్రి వద్ద ఉపయోగంలో లేని భవనం

చంద్రగిరి : ప్రజలు, ఫిర్యాదుదారులు, రోగుల సహాయకుల సౌకర్యార్థం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన వైఎస్సార్ రిసెప్షన్ సెంటర్లు నిరుపయోగంగా మారాయి. కనీసం వాటి నిర్వహణను కూడా అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. గతంలో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయం, పోలీసు స్టేషన్, పాత ఎంపీడీఓ కార్యాలయం, ఏరియా ఆస్పత్రి ఆవరణతో పాటు తిరుపతి రూరల్ మండలంలో మరో 5 భవనాలను రూ.72లక్షలతో నిర్మించి రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. అధికారులకు, ప్రజల మధ్య సేవలకు భవనాలు ఉపయోగించేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రిసెప్షన్ సెంటర్ల నిర్వహణను పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. పోలీసు స్టేషన్ వద్ద రిసెప్షన్ సెంటర్ చివరకు స్టోర్ రూమ్‌గా మారిపోయింది. దీంతో స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులు చెట్ల కింద వేచి ఉండాల్సిన దుస్థితి దాపురించింది. పాత ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని భవనాన్ని ప్రస్తుతం అంగన్‌వాడీ సెంటర్‌గా వినియోగించుకుంటున్నారు. ఇక తహసీల్దార్ కార్యాలయం, ఆస్పత్రి వద్ద భవనాలు చెత్తాచెదారాలతో నిండిపోయాయి.



స్టోర్‌రూమ్‌గా మారిపోయిన సెంటర్

కానరాని స్పందన

వైఎస్సార్ రిసెప్షన్ సెంటర్ల నిర్వహణపై అధికారుల నుంచి కనీస మాత్రం స్పందన కూడా కానరావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనం అవసరాల కోసం నిర్మించిన కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

గుంతలు లేని రహదారులే లక్ష్యం



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోపు తిరుపతిలోని అన్ని వీధుల్లో రోడ్లకు పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాలని స్పష్టం చేశారు. ఎక్కడికక్కడ చేపట్టిన ఇంజినీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. గ్రీవెన్స్‌లో ప్రజలు అందించిన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. నగరంలో వెలసిన అనధికార లేఅవుట్‌లు, భవన నిర్మాణాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు పకడ్బందీగా కృషి చేయాలన్నారు. పన్ను బకాయిలను త్వరగా వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, డీసీపీ మహాపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 38 వినతులు

కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 38 వినతులు వచ్చినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. నగరంలోని వార్డుల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ అనిల్‌కుమార్ వేర్వేరుగా కమిషనర్‌ను కోరారు. ఈ క్రమంలోనే పలు సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మొహిద్దీన్‌బాషా

పాకాల : విద్యార్థులపై అధ్యాపకులతోపాటు తల్లిదండ్రులకు కూడా ప్రత్యేక శద్ధ అవసరమని ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో చేపడుతున్న బోధన, నిర్వహిస్తున్న పరీక్షలను వివరించారు. బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బేబీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు ఇంటికి రాగానే కళాశాలలో ఏయే పాఠ్యాంశాలు చెప్పారో అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఇంటి వద్ద తప్పనిసరిగా చదివించాలని కోరారు. అనంతరం విద్యార్థుల హాజరుశాతం, మార్కుల వివరాలను తెలిపారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ రమేష్‌కుమార్, అకడమిక్ కో-ఆర్డినేటర్ ఈశ్వర్‌బాబు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి సరుకుల వితరణ



సరుకులు అందజేస్తున్న దాతలు

భాకరాపేట : తలకోన శ్రీసిద్ధేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి దాతలు బియ్యం, పప్పులు వితరణగా అందించినట్లు ఈఓ కె.మమత తెలిపారు. సోమవారం ఈ మేరకు తలకోనలోని సాయిబాబా గుడి తరపున 20 కేజీలు కంది పప్పు, బస్తా బియ్యం, పులిగోనుపల్లెకు చెందిన వెంకటసిద్ధులు 10 బస్తాల బియ్యం, చెంగాడవాండ్లపల్లెకు చెందిన మహేశ్వర్‌రెడ్డి 2 బస్తాల బియ్యం అందజేసినట్లు వివరించారు.

టెట్‌లో శ్రీప్రజ్ఞ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : పద్మావతి కల్యాణ మండపం సమీపంలోని శ్రీప్రజ్ఞ డీఎస్సీ కోచింగ్ సెంటర్ విద్యార్థులు సోమవారం విడుదల చేసి టెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సి.మల్లీశ్వరి తెలిపారు. పి.చాంద్‌భాషా 150 మార్కులకు గాను 145, బి.మానసతో పాటు 30 మంది విద్యార్థులు 130 మార్కులకు కంటే ఎక్కువగా సాధించారని వెల్లడించారు. మొత్తం కోచింగ్ తీసుకున్న వారిలో 98.50 శాతం ఉత్తీర్ణులైనట్లు వివరించారు.అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

టీటీడీ బోర్డులో క్షత్రియులకు మొండిచేయి

తిరుపతి అర్బన్ : టీటీడీ పాలక మండలిలో క్షత్రియులకు చోటు కల్పించకుండా మొండిచేయి చూపించారని క్షత్రియ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ సి.నారాయణబాబు, ప్రెసిడెంట్ ఎస్.బలరామరాజు మండిపడ్డారు. సోమవారం వారు మాట్లాడుతూ టీటీడీ బోర్డు చరిత్రలో క్షత్రియులకు స్థానం దక్కకపోవడం ఇదే తొలిసారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తమ సామాజికవర్గంవారు తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి క్షత్రియులకు తుడా చైర్మన్‌గా అయినా అవకాశమిచ్చి, తద్వారా టీటీడీ బోర్డులో ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదా కల్పించాలని కోరారు.

ఫిజిక్స్ విభాగాధిపతిగా దేవప్రసాద్‌రాజు



దేవప్రసాదరాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

తిరుపతి సిటీ : ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ ఫిజిక్స్ విభాగాధిపతిగా ప్రొఫెసర్ దేవప్రసాదరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2007లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా వర్సిటీలో చేరిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. సుమారు 15మంది ఆయన పర్యవేక్షణలో పీహెచ్‌డీ పట్టాలు పొందారు. ఫిజిక్స్‌లో ఆయన రాసిన 120కి పైగా ఆర్టికల్స్ ప్రచురితమవడం విశేషం. దేశ, విదేశాలలో నిర్వహించిన అనేక సదస్సుల్లో దేవప్రసార్‌రాజు ప్రసంగించి పలు అవార్డులను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఫుడ్ సేఫ్టీ పాటించకుంటే చర్యలు



వంటగదిని తనిఖీ చేస్తున్న డాక్టర్ యువ అన్వేష్

తిరుపతి తుడా : నగరంలోని స్పైసీ ప్యారడైజ్ హోటల్‌లో కార్పొరేషన్, ఫుడ్‌సేఫ్టీ అధికారులు సోమవారం మధ్యాహ్నం తనిఖీలు చేపట్టారు. ఆరోగ్యశాఖ అధికారి యువ అన్వేష్ మాట్లాడుతూ వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు హోటల్‌లో తనిఖీలు చేశామన్నారు. సేఫ్టీ ప్రమాణాలు పాటించకపోవడం, అపరిశుభ్రంగా ఉండడం, స్టాక్ వద్ద భారీ సంఖ్యలో బొద్దింకలు ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. ఈ మేరకు హోటల్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవడంపై ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించి సర్టిఫికెట్లు తీసుకోవాలని హోటల్ యాజమాన్యాన్ని ఆదేశించినట్లు వివరించారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలని స్పష్టం చేశామన్నారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిపారు. ఈ హోటల్‌లో సేకరించిన ఫుడ్ శాంపిళ్లను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు వెల్లడించారు రిపోర్టులు వచ్చిన తర్వాత నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు.


విదేశీ పరిశోధకులతో కలిసి పనిచేయండి



రామ్మోహన్‌రావును సత్కరిస్తున్న వర్సిటీ సిబ్బంది

తిరుపతి సిటీ: ఏపీ ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహన్ రావు సోమవారం ఎస్వీయూను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పరిశోధన రంగంలో ర్యాంకులు సాధించడానికి పేటెంట్లతోపాటు ప్రపంచస్థాయి జర్నల్స్‌లో ప్రచురణలు ఉండాలన్నారు. విదేశీ పరిశోధకుల బృందంతో కలిసి పని చేయాలని సూచించారు. అనంతరం చైర్మన్‌ను అధికారులు, అధ్యాపకులు సన్మానించారు. వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాళ్లు సుధారాణి, తులసీ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగులకు చిత్తశుద్ధితో సేవ



బ్యాంకు పాలకవర్గం

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగులకు చిత్తశుద్ధితో సేవలందిస్తామని టీటీడీ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ బ్యాంకు నూతన అధ్యక్షుడు కిషోర్‌కుమార్ తెలిపారు. సోమవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం వద్ద బ్యాంకు పాలక వర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డైరెక్టర్లు, ఉద్యోగుల సలహాలతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. అనంతరం కిషోర్ కుమార్‌తోపాటు ఉపాధ్యక్షుడిగా తలారి మహేష్, కోశాధికారిగా ముని వెంకటరెడ్డి, డైరెక్టర్లుగా గంగా రాజ్‌కుమార్, దుర్గైరాజు,హేమసుధ ప్రమాణ స్వీకారం చేశారు.

నీతి యుక్త సమాజ స్థాపనకు కృషి



పాల్గొన్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: భారతదేశాన్ని అవినీతి రహితంగా నిర్మించాలని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. వర్సిటీలో గత వారం రోజులుగా జరుగుతున్న విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ నీతియుక్తమైన సమాజ స్థాపనకు యువత కృషి చేయాలని సూచించారు. అనంతరం క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. డీన్‌లు రజనీకాంత్ శుక్లా, దక్షిణామూర్తి శర్మ, వెంకట్రావు, సీతారామ్‌శర్మ పాల్గొన్నారు.